# ఏడో కడ్డీ

మధ్యాహ్నం బడి వదలింతర్వాత కిటికీ వద్ద కుర్చీలో కూచుని క్యారియర్ విప్పాను. చిక్కుడు కాయల పులుసు వాసన రుచిగా మొహానికి కొట్టింది. బైటి దృశ్యాల్ని కళ్లతో నంజుకొంటూ తృప్తిగా భోంచేసి బోరింగ్ వద్ద చేతులు కడుక్కొంటోండే రమణ వస్తూ కన్పించాడు.

"ఏమయ్యా! ఏమిటి విశేషాలు?" పలకరించాను.

"విశేషాలకేం సార్! మస్తుగా వుండాయి." నవ్వుతూ చెప్పాడు.

"మస్తులొద్దుగాని, ముఖ్యమైంది ఒక్కటి చెప్పు."

"ఈరోజు సాయంత్రం మావూరికి రెండవదఫా 'ప్రజల వద్దకు పాలన' వస్తోంది తెలుసా".

"అయితే?"

"అధికారులెవ్వర్నీ వూర్లోకి రానీకుండా ఘెరావ్ చెయ్యాలనుకొన్నెం" చెప్పాడు.

"ఎందుకని?"

"ఎందుకంటావేం సార్! మొన్న సమావేశాల్లో మాకిచ్చిన వాగ్దానాల్లో ఒక్కటంటే ఒక్కటి నెరవేర్చారా? రోడ్ల విషయాలూ, ఋణాల విషయాలూ యివన్నీ పక్కన బెట్టులే. ప్రభుత్వం సంపూర్ణ మద్య నిషేధాన్ని చట్టం చేసిన యీ సమయంలో - మా వూర్లో సారాయి అమ్మేవాళ్ల పేర్లతో సహా ఫిర్యాదు చేసినం గదా! రచ్చబండల మీద విచ్చలవిడిగా పేకాడే వాళ్లగురించి మొరపెట్టుకొన్నెం గదా! వాళ్ల మీదయిన చర్య తీసుకొన్నెర. మధ్యలో మళ్లీ పోలీసు స్టేషన్లో గుర్తుజేసి వచ్చినాకూడా 'ఇది మామూలే' నన్నట్టు పోలీసులు ఫోజు బెట్టిన్రు. పేకాడేవాళ్ల దగ్గిర మామూల్లు కూడా తీసుకొన్నెరని తెల్సింది. ఇంకా యీ కార్యక్రమాలెందుకు సార్?" ఆవేశంగా అన్నాడు.

"తొందరపడొద్దు రమణా!" సముదాయించేందుకు ప్రయత్నించాను.

"అసలు.. యీ పి.వి.పి.కార్యక్రమాల మీద నీ ఉద్దేశ్యమేమిటి, సార్?" అడిగాడు.

"సదుద్దేశమే" చెప్పాను. "మొత్తానికి అధికారులందర్లో చలన మొచ్చింది. ఎక్కడో ఆఫీసుల్లో కూచుని ప్రజల్ని చీదరించుకొనేవాళ్లంతా, ప్రజల వద్దకొచ్చి చేతులు కట్టుకొని నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది."

"అంతకు దప్ప ప్రజలకేమయినా వొరిగేదుందా?"

"ఒరగటం అంటే.. స్వాతంత్ర్య మొచ్చి యిన్ని దశాబ్దాలు గడుస్తోన్నా తీరని కోరికల్ని ప్రభుత్వం ఒక్క నెలలోనే తీరుస్తుందని నమ్మటం ప్రజల అమాయికత్వం. అధికారులు వస్తున్నారనేసరికి మనిషికి నాలుగైదు కోరికల్తో చుట్టుముడుతున్నారు."

"ఆశ సార్! పదిరాళ్లేస్తే ఒక్కరాయన్నా తగలకపోతదా అని ఆశ. దీన్ని అడ్డం పెట్టుకొని అధికారులు నాటకాలాడ్తున్నారు. అందుకే ఘెరావ్ చెయ్యాలనుకొన్నిం. కానీ మావాళ్లే అంత గొడవ ఎందుకు లెమ్మనటంతో సమావేశంలోనే వాళ్ల అసమర్థతను దుయ్యబట్టాలనుకొన్నెం." చెప్పాడు.

"మంచిది" అన్నాను.

ఇద్దరం మాట్లాడుకొంటూ వీధిలోకి నడిచాము.

బంకు వద్ద జనం గుమిగూడి వున్నారు.

"ఏం సార్! మీకేమీ సమస్యల్లేవా?" అడిగాడు ఓ పేకాటరాయుడు.

"ఎందుకు లేవు. బడి చుట్టూ ప్రహరి కట్టించమని అడగాలి"

"మేం కూడా ఒక కోరిక అడగాలనుకొన్నాం సార్!" చెప్పాడు అతనే.

"మీ సంఘమంతానా?" నవ్వుతూ అన్నాను.

"ఆ.. అందరం కలిసే. మాది కూడా అత్యవసర సమస్యే సార్! ఇప్పుడంటే ఏ అరుగుమీద కూకున్నే యిబ్బందిలే. వానాకాలం వొచ్చిందంటే సాలు మాకెక్కడా జానెడు తావుదొరకదు. అందుకే.. యీ రచ్చబండ మీద రేకుల షెడ్డు వేయించమని అడగాలనుకొన్నాం. మీలాగా మాకు ఉచితంగా ఏమొద్దులే సార్! ఆటకింత ఎత్తి కంతుల వారీ తీరుస్తం."

అక్కడున్న వాళ్లంతా పకపక నవ్వారు.

రమణకేసి చూశాను.

అతని మొహం వెలవెలబోయి వుంది.

అతడు తమమీద రిపోర్ట్ ఇచ్చాడనే ఉద్దేశ్యంతోనే రమణ వినేట్టుగా జోకేశాడు.

పోలీసుల అసమర్థత గురించి రమణ ఎంత బాధపడుతున్నాడో నాకిప్పుడు అర్థమైంది. అక్కణ్నించి ఇద్దరం వెనుదిరిగాము.

"ఈ దేశానికి సమర్థుడైన నియంత అవసరం సార్!" చెప్పాడు రమణ.

"అప్పుడు నువ్విట్లా అభిప్రాయాన్ని తెలపటం కూడా వుండదు గదా!" అన్నాను.

"అవసరం లేదు సార్! మాటల్తో పనేలేదు. పన్జేస్తే తిండి. లేదంటే పస్తులు వంగినా తన్నాలి. లేచినా తన్నాలి."

"ఆవేశ పడకు." భుజమ్మీద చరిచాను.

"స్కూల్ టయమవటంతో పిల్లలంతా పుస్తకాల సంచుల్ని ఉయ్యాలలూగిస్తూ వస్తున్నారు.

రమణ ఇంటికెళ్లాడు.

సాయంత్రం స్కూల్ వదలింతర్వాత పి.వి.పి. కార్యక్రమం పూర్తయ్యేదాకా ఇక్కడే ఉండాలనుకొన్నాను.

ఐదుగంటల ప్రాంతంలో మూడు జీపుల్నిండా అధికారులు వచ్చారు. దేవాలయం ముందు ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో కూచున్నారు.

"సార్! సార్! మాకో అర్జీ రాసీ సార్!" తెల్ల కాగితంతో నాముందుకొచ్చాడు ఓ వ్యక్తి. ఒక మిద్దె పంచలో కూచున్నాము. తర్వాత ఒకరి వెనక మరొకరు. అక్కణ్నించి లేచేందుకూ్డా అవకాశం చిక్కలేదు.

రెవిన్యూ ఉద్యోగి ఒకరు రేషన్ కార్డుల లిస్ట్ చదువుతున్నాడు. దొంగకార్డులుంటే గుర్తించమని ప్రజలకు చెబుతున్నాడు.

తమకసలు కార్డే లేదని గోలపెట్టే వాళ్లేగాని దొంగ కార్డుల గురించి ఎవరూ పట్టించుకున్నట్టు లేదు.

"సార్! మీ వూరోల్లనెవుర్నో పోలీసోల్లు పట్టుకొచ్చిన్రే.."

తలెత్తి చూశాను.

"జీపులో వుండాడు. ఏదో దొంగతనం కేసంట."

"మా వూరోల్లా!" కాగితాలు పక్కన బెట్టి లేచాను.

నాకు ఆశ్చర్యంగా వుంది.
"మావూర్లో దొంగతనానికి పాల్పడేంతటి ఘనాపాటీలు ఎవరా' అని జీపు వద్దకు వెళ్లేదాకా వెదకినా ఒక్కడూ కన్పించలేదు.
జీపుచుట్టూ నలుగురు పోలీసులున్నారు.
'అంత బలమైన నేరమా! నాకాశ్చర్యం తగ్గలేదు.
నాకు తెలిసి మావూర్లో తాగుడు బోతులు లేరు. పేకాటగాళ్లు లేరు. అడపాదడపా పేడకోసమో, గడ్డికోసమో కొట్లాట్టం తప్ప మరో ఘర్షణలు కూడా ఎరుగరు.
ఆసక్తిగా జీపులోకి తొంగిచూసి అదిరిపడ్డాను.
సూరయ్య. శరీర శ్రమ తప్ప మరొకటి ఎరుగని సూరయ్య. కొట్లాటంటే ఆమడదూరం పరుగెత్తే సూరయ్య.
అతను దొంగతనం చేశాడంటే నమ్మటమెట్లా!
"ఏంది సార్ సంగతి?" పక్కనున్న పోలీసతన్ని అడిగాను - లోపలికి చూపిస్తూ.
"మామూలే.. కరంటు తీగల దొంగతనం.."
నేను జీపులోకి తలదూర్చి 'నిజమేనా?' అన్నట్లుగా సూరయ్యకేసి చూశాను.
విషాదంగా నవ్వాడు అతను. "నా ఖర్మ సామీ!" అన్నాడు.
"అసలేం జరిగింది?" అడిగాను.
"ఇదో... యీల్ల పున్నెమే.." పక్కనున్న ఇద్దర్ని చూపించి చెప్పాడు." మోటారు కాడికి కరంటు లాక్కొనేందుకు తీగె తక్కువయిందెని నన్నొచ్చి అడిగిన్రు. 'పాపం.. పైరెండి పోతాం'దెని నాకూ కనికరం పుట్టింది. మా మోటరుకాడి లైనుమీది న్యూట్రల్ వైరు చూపించినా. అంతటా తీసప్పోయి బిగించుకొన్నెరు గదా! ఇప్పటి దాకా మేము దీన్ని కాపాడ్డమే గొప్ప. వీల్లు గూడా దాన్ని కోసప్పోయి దావలోంచి వాల్ల మోటారు కాడికి లాగుతాన్నెరు. ఇదో యీ జీపులన్నీ నర్సాపురాన్నించి వొస్సొ యీల్లుజేసే పన్జూసి ఆపి నా, యీల్లు మాత్రం కొక్కీలు తగిలించడం మానలే. పోలీసోల్లొచ్చి పట్టుకొన్నెరు. 'తీగ' ఎక్కన్నించి తెచ్చినా'రని అడిగితే నా పేరు జెప్పిన్రు. నేనప్పుడే నర్సాపురం నుంచి వస్సాన్నె. వూరిగ్గూడా పోలే.."
విషయం అర్థమైంది నాకు.
అమాయకుడు కేసులో ఇరుక్కొన్నాడు. ముందు ఇతని విషయం చూడాలి.
అధికారులతో గొడవ పడుతోన్న రమణను పక్కకు పిల్చి అంతా చెప్పాను.
అతను కూడా సానుకూలంగా స్పందించాడు. ఓ అమాయకుణ్ని కటకటాల పాలు గాకుండా తప్పించటమే న్యాయమన్నాడు.
నేరుగా నోడల్ అధికారి వద్ద కెళ్లాము. విషయమంతా వివరించాము.
"సమస్య ఎలక్ట్రిసిటీ వాళ్లది కాబట్టి.. అడుగో డియ్యీ వున్నాడు. అతన్ని అడగండి." చెప్పాడు ఆయన.
డి.ఇ.వద్ద మమ్మల్ని పరిచయం చేసికొని సూరయ్యను గురించి చెప్పాము.
"ఔనయ్యా! దొంగతనం చేసిన వాళ్లని ఎట్లా వదలాలి?" ప్రశ్నించాడు.
"ఎక్కడ దొంగతనం సార్! మీ డిపార్ట్‌మెంట్‌లో దొంగతనమనే మాటకు అర్థముందా?" రమణ అన్నాడు.
"అదేంటి అట్లాగంటావ్? ప్రభుత్వ సొమ్మును తన స్వంత సొత్తులా కోసివ్వటం దొంగతనం కాదా?"

"అతను చెయ్యలేదు సార్ ఆపని. నర్సాపురం వాళ్లు చేశారు. వాళ్లు కూడా కొత్తగా ఏమీ చేయలేదు. దాదాపు ఐదు కిలోమీటర్ల పొడవునా స్థంభాలమీది న్యూట్రల్ తీగ కోసి మోటార్లకాడికి లాక్కొన్నెరు. వాళ్లగ్గూడా అది తప్పడంలే. మీకాడికొస్తే మీరు మూరెడు వయరు కూడా ఇయ్యరు. అంతా టోకున మీరే అమ్మేసుకొంటారు. కొందామంటే మార్కెట్లో దొరికేదికాదు. మోటార్లు దించకుంటే పైరు పెట్టే దానికి లేదు. వయరు లేకుంటే కరంటు రాదు. ఏం చావాల సార్? అస్సలు దొంగతనమంటే ఏంది సార్? మీరొచ్చే దారిలో ఎన్ని మోటార్లు కొక్కిలు తగిలించి అక్రమంగా ఆడటం లేదు. మీరిన్ని వూర్లు తిరిగారు గదా! ఏ ఒక్క వూర్లో అయినా అన్ని యిండ్లకూ సక్రమంగా మీటర్లు బిగించి కరంటు వాడుకుంటున్నారా? అంత దూరం పన్లే. ఇదో.. అట్లా తలపైకెత్తి చూడండి.. తీగలమీద నుండి ఇండ్లమీదకు పందిర్లాగా ఎన్ని అక్రమ వయర్లో! పట్టుకోండి చూద్దాం. అక్రమ కనెక్షన్లు తీసుకొనే వాళ్లెవురూ అది అక్రమమని అనుకోవట్లేదు సార్! ఎందుకంటే – మీరెప్పుడూ తనిఖీ చేసిన పాపాన పోలేదు కాబట్టి. అక్రమ వాడకం దార్లమీద చర్య తీసికోలేదు కాబట్టి ఇక కరంటు వాడకంలో దొంగతనమెక్కడ? దొరతనమెక్కడ సార్?" అన్నాడు రమణ.

"నువ్వు చెప్పే విషయాలన్నీ నాకు తెలుసయ్యా! నేనూ రైతు బిడ్డనే.కేవలం మా డిపార్ట్‌మెంట్ వాళ్లమయివుంటే వీళ్లకేసి కన్నెత్తి కూడా చూసేవాళ్లం కాదు. ఎమ్మార్వో, ఎండీవో, పోలీసులూ అందరున్నారు. కాబట్టి వీళ్లను తీసుకురావాల్సి వచ్చింది. అక్కడికీ జీపు నిలిపి కొంతసేపు వెయిట్ చేశాము – మమ్మల్ను చూసి పారిపోతారేమోనని. వాళ్లక్కన్నించి కదలకుంటేనూ.." డియ్యీ ఆగాడు.

నవ్వాను నేను. "తాము చేసేది దొంగతనమనే స్పృహ వాళ్లకుండాలి గదేం సార్! – పారిపోవాలంటే. అందులోనూ పోలీసులకూ కరంటుకూ సంబంధమేమిటో వీళ్లకు చచ్చినా అర్థమయుండదు." చెప్పాను.

"ఇంత మందొచ్చి మంచి గజదొంగల్నే పట్టుకొన్నెరు.. వదిలెయ్యండి సార్ వాళ్లను." రమణ అన్నాడు.

"వదిలేటట్లయితే పట్టుకొనే వాళ్లం కాదు." చెప్పాడు ఆయన. "ఈ రోజు మినిస్టర్ మాట్లాడిన మాటలకయితే 'మేం బతకడమెందుకా?' అన్పించింది. ఉద్యోగానికి రాజీనామా చేసి ఇళ్లకు పోదామనిపించింది. పెళ్లాం పిల్లల్ని సాక్కొనేందుకు మరేపనీ చేతగాని వెధవలమై ఇంకా యీ ఉద్యోగాల్ని అంటిపెట్టుకోనున్నాము" బాధగా చెప్పాడు.

"ఏం జరిగింది సార్?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఏం చెప్పాల సార్ మా బాధలు! ఉప్పలూరు పి.వి.పి. కార్యక్రమానికి మినిస్టరు వచ్చాడు. 'మాకు కరంటు చాలటం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా బిగించటం లే'దని ప్రజలు ఫిర్యాదు చేయటంతో ఆయన నిప్పులు తొక్కిన కోతిలా నామీద విరుచుకు పడ్డాడు. నేనక్కడికీ వివరించి చెప్పాను– 'అక్రమ వాడకం దార్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటం జరుగుతున్నాయనీ, కరంటు చార్జీల బకాయిలు కట్టకపోగా వారానికో ట్రాన్స్‌ఫార్మర్ కాల్చుకొస్తోంటే మేం మాత్రం ఎక్కన్నించి తేగల'మనీ చెప్పినా ఆయన వినిపించుకోలేదు. 'అక్రమ వాడకం దార్లను పట్టుకోకుండా మీరేం చేస్తున్నారు? గాడిదలు కాస్తున్నారా?' అంటూ సభ్యత తెలీని మాటలతో నన్ను ప్రజలందరి ముందూ తిట్టాడు.ఆయన ఆపుజూసుకొని జనం కూడా

తిట్టారు. ఉద్యోగస్తుల పరిస్థితి అంతగా దిగజారిపోయింది సార్! అంతటితో పూరకుంటే బావుండేది. చివరగా నన్ను పిల్చి అందరి సమక్షంలో ఒక మాట చెప్పాడు- "నా ప్రజలు బీదవాళ్లు, అక్రమ కనెక్షన్లున్నాయని మోటార్లుగాని స్టాటర్లుగాని తీసికెళ్లేరు. జాగ్రత్త.. వూర్లో కొచ్చి, అరుగుమీద కూచుని మీరే పంచాయితీజేసి, అక్రమ సక్రమ వాడకం దార్లను షిష్టు పద్ధతిలో మోటర్లు ఆడించు కోమని చెప్పండి... విలేకర్లూ! యీ విషయం రాసుకోకండమ్మా! ఇది అంతరంగికం-' అంటూ వెళ్లిపోయాడు. ఇక మమ్మల్నేం చేయమంటారు! చెప్పండి.. వాళ్ల చేతుల్లో కీలుబొమ్మలమై పోయాము." ఆవేదన సుడులు దిరిగింది ఆయన కంఠంలో.

"రాజకీయాల్లేకుంటే యీ అక్రమ వాడకాలు కూడా వుండవు సార్! మీరిప్పుడు వాళ్లను స్టేషన్లో అప్పజెప్తుతారు. ఆ మినిస్టరీ మల్లా ఫోన్ జేసి విడిపిస్తాడు. ఇక మీశ్రమకు విలువేముంటుంది?" రమణ అన్నాడు.

"అందుకే వీళ్లను వదలకూడదని మేమంతా నిర్ణయించుకొన్నాం. ఉదయం మాట్లాడిన ఆ నాలుకతోనే ఆయన మళ్లీ ఫోన్ జేయాలి. అప్పుడు మేం వదలాలి" అప్పుడే అక్కడకు వచ్చిన యస్సై చెప్పాడు.

"రాజకీయ నాయకులకు ఉండేది నాలుక అని మీరెట్లా అనుకొంటున్నారు సార్! ఆ నాలుక కోసం యీ అమాయకుల్ని మానసికంగా ఎందుకు బాధపెడ్తారు పాపం? వదలండి సార్!"

కొంతసేపు ప్రాధేయ పడ్డాము.

"నా వొక్కన్తో అయ్యేపనిగాదది. ఎమ్మార్వోను అడగండి" చెప్పాడు ఎలక్ట్రికల్ డి.ఇ.

తర్వాత ఎమ్మార్వోను కలిశాము.

ఆయన ఎండీవో ముందుంచాడు.

ఎండీవో పోలీసుల మీద భారం మోపాడు.

పోలీసులు కరంటు వాళ్లను సూచించారు.

రాత్రి ఏడు గంటలు దాటినా సమస్య వొగదెగలేదు.

ఇంతలో నర్సాపురం నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తమ వూరివాళ్లను వదిలేయమని అధికారుల్ని నిలదీశారు. 'ఎక్కడో పోలీస్టేషన్లో వీళ్ల నేరం నిరూపించడమేమిటి? ఇది ప్రజల వద్దకు పాలనగదా! ఇక్కడే పంచాయితీ జరపం'డంటూ ఘర్షణ పెట్టుకొన్నారు. ముద్దాయిలు ముగ్గుర్లో ఒక్కడు తీగ యిచ్చిన వాడయితే, మరొకడు తెచ్చుకొన్నవాడనీ, మూడోవాడు కేవలం కూలిమనిషి కాబట్టి అతన్ని అయినా వదలమని కేకలేశారు. జీపులకు అడ్డంగా నిల్చున్నారు.

అధికారులంతా చర్చించుకొని మూడవ వ్యక్తిని వదిలారు.

జీపులు స్టార్టయ్యాయి.

సూరయ్య నాకేసి దీనంగా చూస్తూ "రేత్రికేమన్నా కొడ్తారేమో పోలీసులు?" అన్నాడు.

"కొట్టరులె'మ్మని అతనికి ధైర్యం చెప్పాను.

అతన్ని తల్చుకొంటే బాధగా వుంది.

జీపులు వూరుదాటిం తర్వాత అన్పించింది నర్సాపురం వాళ్లాలాగా మేమూ కేకలేసి జీపుల్ని నిలేసుంటే మావాణ్ని కూడా వదిలేవారని.

"ఘర్షణలకు కూడా అలవాటు పడాలి సార్!" రమణ చెబుతోంటే నిజమేనని పించింది.

నేరుగా వూరికెళ్లాను.

విషయం విని వెంటనే ప్రయాణమయ్యారు సూరయ్య బంధువులు.

'నేనొస్తాను. ఆగ'మని అంటోన్నా విన్పించుకోకుండా మహా ఆతృతగా వెళ్లారు మోటారు బైకు మీద.

అన్నం తిని మిత్రుడి మోపెడ్ ఇప్పించుకొని పాపిరెడ్డిపల్లెలో రమణను పికప్ జేసికొని కలసపాడు వెళ్లేసరికి వాళ్లు రాజకీయాన్ని ఉపయోగించి చాలా వరకు పనిపూర్తి చేశారు.

"ఏం సార్! మినిస్టర్ ఫోన్ చేశాడా? మీరే నిర్ణయించుకొని వదిలారా?" యస్సైని అడిగాడు రమణ.

"మనిషిని పంపాడు." చెప్పాడు యస్సై.

"మినిస్టరే పంపాడా?"

"ఆయన దగ్గరి మనిషే. ఇంకెవరు పంపిస్తారు? పొద్దున్నే వదలమన్నాడు."

ఇద్దరం వెనక్కి తిరిగాము.

స్టేషన్. బైటకొచ్చింతర్వాత రమణ అన్నాడు "మిమ్మల్ని చూస్తోంటే జాలిగా ఉంది సార్!" అని నాతో.

"ఏం?"

"ఆకలి పూడ్చుకొనేందుకు కడుపునిండా తిండి లేకున్నే - అభిప్రాయాల్ని చెప్పేందుకు గుండెనిండా ధైర్యమన్నా వుంది మాకు." చెప్పాడు.

నేను ఆలోచిస్తూ మోపెడ్ అందుకొన్నాను.

ఉదయం పదిగంటలకే సూరయ్య ఇంటికొచ్చాడు. ఎదురయిన వాల్లకంతా తన ఒక్కరోజు జీవితాన్ని గురించి కథలు కథలుగా చెబుతున్నాడు.

అవునుమరి. మా వూర్లో మొదటిసారి జైలుకెళ్లి వచ్చిన వ్యక్తి అతనే కదా!

రాత్రి దేవాలయం ముందు మిత్రులతో బాతాకానీ వేస్తున్నపుడు సూరయ్య అన్నాడు "ఏడుకడ్డీలంటరే మామా! నేను తెల్లార్లూ జైల్లో వున్నే. నిద్రబట్టక తలుపు కడ్డీల్ను ఎంచితే ఆరే వున్నెయే?" అని.

"ఒక్కరాత్రి జైలుజేసినా పెద్ద నిజమే కనుక్కొన్నెవోయ్ నువ్వు"

"సరిగ్గా ఎంచినవా?"

"ఒక్కసారా రొండుసార్లా! తెల్లార్లూ అదే పని. ఆరేవుండయ్. ఏంమామా!" సూరయ్య అడిగాడు మళ్లీ.

"ఏడోది వుంది." సాలోచనగా చెప్పాను.

"లేదు సామీ! ఆరే..."

"నువ్వు గమనించలే..."

"నిజంగానా!" అతని కళ్లల్లో ఆశ్చర్యం.

"ఆ.. ఆ ఏడోదే... రాజకీయం" చెప్పాను.

"నిజమే.. నిజమే.." తలూపాడు సూరయ్య. "జైల్లో బేసినట్టూ యిడిపించినట్టూ.. నిజమే.." అనుభవించాడు కాబట్టి అతనికి వెంటనే అర్థమైంది.

మిగిలిన వాళ్లు కొంత ఆలస్యంగా అర్థం చేసికొన్నారు.

● ఆంధ్రజ్యోతి సండే - 1 సెప్టెంబర్, 1996 ●